సాక్షి
మెదక్
మంగళవారం । 20 । ఫిబ్రవరి । 2024



మినీమేడారం.. సర్వం సిద్ధం

మినీమేడారం జాతరకు సర్వం సిద్ధం చేశారు. మేడారం వెళ్లలేని భక్తులు ఇక్కడ దర్శించుకొని తమ మొక్కులు చెల్లించుకుంటారు. వివరాలు 8లో ▸



తెలంగాణకు గుండెకాయ..

శాశ్వతంగా కరువును దూరం చేసేందుకే మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. వివరాలు 8లో ▸



పాలకేంద్రం ఏర్పాటు చేయరా?

అల్లాదుర్గం పట్టణంలో పాలకేంద్రం ఏర్పాటు కలగానే మిగిలింది. సామగ్రిని వినియోగంలోకి తెచ్చి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

మెదక్ ఇన్‌చార్జ్ డీపీఆర్వోగా రాంచంద్రరాజు


రాంచంద్రరాజు

మెదక్ కలెక్టరేట్: మెదక్ ఇన్‌చార్జ్ డీపీఆర్వోగా రాంచంద్రరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మేడారం జాతర విధుల నిర్వహణకు తరలివెళ్లారు. ఇటీవల పూర్తి బాధ్యతలతో బదిలీపై వచ్చిన భీంకుమార్ డిప్యుటేషన్‌పై జగిత్యాలకు వెళ్లారు. కాగా ఆయన స్థానంలో వరంగల్‌లో అసిస్టెంట్ ఏపీఎస్‌గా పనిచేస్తున్న రాంచంద్రరాజు ఇంచార్జ్‌గా బదిలీపై మెదక్‌కు వచ్చారు. ఇక్కడ బాధ్యతలు స్వీకరించిన వెంటనే మేడారం జాతరలో విధుల నిర్వహణకు ఆదేశాలు రావడంతో తరలివెళ్లారు.

చేపలు అమ్ముకునే వీలు కల్పించాలి


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

మెదక్ కలెక్టరేట్: మార్కెట్‌లో చేపలు అమ్ముకునే అవకాశం కల్పించాలని హవేళిఘణాపూర్ మండలం బూర్గుపల్లి మత్స్యకారులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. నిబంధనలకు అనుగుణంగా తైబజార్ చెల్లిస్తున్నా.. తమను మెదక్‌లో చేపలు అమ్ముకోనివ్వకుండా స్థానికులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఏళ్ల తరబడి తాము మెదక్‌లో చేపలు అమ్ముతున్నప్పటికీ ఇటీవల కొందరు అడ్డుకుంటున్నారని వాపోయారు. ఈవిషయంలో కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

నిధుల డ్రాకు ఉత్తర్వులు ఇవ్వండి

మెదక్ కలెక్టరేట్: పాఠశాలలకు సంబంధించిన నిధులను హెచ్‌ఎంలు డ్రా చేసుకునే విధంగా మార్గదర్శకాలు జారీ చేయాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరి కృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన మెదక్‌లో మాట్లాడుతూ.. ఈవిద్యా సంవత్సరం ముగింపు దశకు చేరుకుందని. మరోవైపు ఎస్‌ఎంసీల కాలపరిమితి డిసెంబర్ నెలాఖరుతో ముగిసినట్లు తెలిపారు. పాఠశాలలకు విడుదలైన స్కూల్ గ్రాంట్స్ ఉపయోగించుకునే విధంగా ప్రభుత్వం అవసరమైన మార్గదర్శకాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అక్రమ మట్టి రవాణాకు చెక్

- విజిలెన్స్ కమిటీ ఏర్పాటు

మనోహరాబాద్(తూప్రాన్): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న వారిని అడ్డుకునేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు మండల విజిలెన్స్ కమిటీని ఎన్నుకున్నట్లు తూప్రాన్ ఇరిగేషన్ డీఈ శ్రీకాంత్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో జోరుగా అక్రమ మట్టి రవాణా జరుగుతుండడంతో పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ఈ మేరకు మనోహరాబాద్ మండల విజిలెన్స్ కమిటీని నియమించినట్లు తెలిపారు. ఈ కమిటీలో ఇరిగేషన్ డీఈతో పాటు ఏఈ అనురాధ, సూపర్ వైజర్‌గా శ్రీనివాస్‌ను నియమించారు. ఏదైనా సమాచారం ఉంటే డీఈ, ఏఈలతో పాటు సూపర్‌వైజర్ 9603736883 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

మైనార్టీ విద్యార్థులకు విదేశీ విద్యావకాశం

మెదక్ కలెక్టరేట్: మైనార్టీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం విదేశీ విద్యా పథకం కింద ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి జెమ్లా నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 ఆగస్టు 1 నుంచి డిసెంబర్ 2023 వరకు ఎంపిక చేసిన యూనివర్సిటీల్లో అడ్మిషన్ పొంది ఉండాలన్నారు. పూర్తి సమాచారం కోసం జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడా విభాగాల్లో అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు బాయ్స్ స్పోర్ట్స్ కంపెనీ, అర్టిలరీ సెంటర్‌లో ఆల్ ఇండియా ఓపెన్ సెలక్షన్ జరుగనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత గల బాలురు ఈనెల 21 నుండి 27వ తేదీలోగా హైదరాబాద్‌లోని మఖాన్‌సింగ్ అథ్లెటిక్స్ స్టేడియంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 9347344440 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఒక్కసారిగా ఆకాశానికెగిసిన రియల్ బూం అదే వేగంతో నేలను తాకింది. దీంతో ఎకరాలకెకరాలు కొనిపెట్టుకున్న రియల్టర్లు ఏం చేయాలో తోచక తలలు పట్టుకుంటున్నారు. చాలామంది భూములను స్థానిక రైతులకు కౌలుకు ఇస్తున్నారు. కొందరు దీర్ఘకాలిక పంటలు వేసుకుంటున్నారు. మరికొందరు ఫాంహౌస్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. వ్యాపార ధోరణికి అలవాటు పడిన వారు రిసార్టులు ఏర్పాటు చేసి శుభకార్యాలకు అద్దెకు ఇస్తున్నారు.

– తూప్రాన్


రియల్ వ్యాపారులు కొనుగోలు చేయడంతో బీడుబారిన పొలాలు

రియల్.. ఢమాల్!

దిక్కుతోచని స్థితిలో వ్యాపారులు

- కొనుగోలు చేసిన భూముల్లో సేద్యం
- కొన్నిచోట్ల ఫాంహౌస్‌ల ఏర్పాటు

హైదరాబాద్ నగరానికి ఉమ్మడి తూప్రాన్ మండలం సమీప దూరంలో ఉండడంతో మండలాల రూపురేఖలు మారిపోయాయి. 2004 తర్వాత రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకోవడం, రీజనల్ రింగు రోడ్డు మంజూరుతో మండలంలో భూముల విలువ పెరిగింది. పెట్టుబడిదారులు భూముల కొనుగోలుకు ఎగబడ్డారు. అసెంబ్లీ ఎన్నికల ముందు, ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల వాతావరణం ఊపందుకోవడం రియల్టర్లకు ఆశలు లేకుండా చేశాయని తెలుస్తోంది. అలాగే ఆర్థికమాంద్యంతో పరిస్థితులు మారిపోయాయి. దీంతో రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా దెబ్బతింది.

వ్యాపారానికి స్వస్తి.. సాగులో బిజీ

నాలుగేళ్లుగా చాలా వరకు పొలాలు సాగుకు నోచుకోలేదు. వ్యాపారం కోసం కొన్న భూములను రియల్టర్లు కొన్నిచోట్ల కౌలుకు ఇచ్చారు. కౌలుకు తీసుకున్న వారు ఎడారిగా ఉన్న పొలాలను తిరిగి పచ్చగా తీర్చిదిద్దుతున్నారు. గ్రామాల్లో రైతులు కూడా మళ్లీ వ్యవసాయంపై దృష్టి పెట్టారు. రియల్ వ్యాపారానికి స్వస్తిపలికి సాగు రంగంలో బిజీ అయ్యారు. ఉమ్మడి తూప్రాన్ మండలంలో వ్యవసాయ రంగానికి అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. కూలీలు లేక వ్యవసాయదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రెండేళ్లుగా యూపీ, మహారాష్ట్ర నుంచి కూలీలు వచ్చి ఇక్కడ పని చేస్తున్నారు. ఈ ఏడాది గ్రామస్తులే వ్యవసాయ పనులు చేసుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. ఏది ఏమైనా రియల్‌బూంతో ఎడారిగా మారిన పంట పొలాలు నేడు పచ్చగా కనిపిస్తున్నాయి.

ప్రతికూల పవనాలు

రెండేళ్ల క్రితం ఎగిసిపడిన రియల్ ఎస్టేట్ వ్యాపారం ఆర్థికమాంద్యం ప్రభావంతో కుదేలైంది. తదనంతర పరిణామాలు ప్రతికూల ప్రభావం చూపాయి. తూప్రాన్ డివిజన్ పరిధిలోని మనోహరాబాద్, చేగుంట, వెల్దుర్తి, మాసాయిపేట, నార్సింగి, మెదక్ మండలంలోని చిన్నశంకరంపేట తదితర మండలాల చుట్టుపక్కల ప్రాంతాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నాయి. అలాగే టీఎస్ఐఐసీలో పరిశ్రమల స్థాపన జరుగుతున్న నేపథ్యంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు చాలా మంది ఇక్కడి ప్రాంతాలపై ఆసక్తి చూపారు. అధిక లాభాలను ఆర్జించే ఉద్దేశంతో లక్షలు పోసి భూములు కొని ఆందోళనకు గురవుతున్నారు.

కొనేవారు లేకపోవడంతో రియల్ దందా చతికిలబడింది. పచ్చని పంటలతో కళకళలాడాల్సిన పొలాలు పాతిన కడీలతో బీళ్లుగా మారగా.. కొన్ని ప్రాంతాల్లో వెంచర్లు వెలిశాయి. కొందరు రాజకీయ నాయకులు, వ్యాపారులు పెద్ద మొత్తంలో రియల్ దందా ప్రారంభించి భూములు కొనుగోలు చేసి నష్టపోయారు. కొందరైతే లక్షలాది రూపాయలు

వడ్డీకి తెచ్చి.. వ్యాపారంలో పెట్టి

వడ్డీకి తెచ్చి ఈ వ్యాపారంలో పెట్టారు. ఇప్పుడు వారి పరిస్థితి దయనీయంగా మారింది. కాగా అప్పట్లో నిరుద్యోగులు సైతం భూముల కొనుగోళ్లకు మధ్యవర్తులుగా పనిచేసి కమీషన్ల రూపంలో రూ. లక్షలు అర్జించారు. భూములు కొన్న వారు మాత్రం దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. భవిష్యత్‌లో పుంజుకుంటుందని పలువురు వ్యాపారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.


తూప్రాన్‌లో రైతులు సాగు చేస్తున్న పొలాలు

మళ్లీ పునరావృతం కావొద్దు : డీఐఈఓ

- కొడిపల్లి ఎస్టీ గురుకులం తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐఈఓ సత్యనారాయణ

సాక్షి ఎఫెక్ట్

కొడిపల్లి(నర్సాపూర్): విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించేలా కృషి చేయండి.. గురుకులంలో ఇలాంటివి మళ్లీ పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవని డీఐఈఓ సత్యనారాయణ సిబ్బందిని హెచ్చరించారు. సోమవారం 'సాక్షి'లో మందు తాగుతూ.. దమ్ముకొడుతూ..' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితం కాగా పాఠశాల, కళాశాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఇంటర్మీడియట్ ఎన్విరాల్‌మెంటల్ పరీక్షను పరిశీలించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, లెక్చరర్లతో సమావేశం నిర్వహించారు. పరీక్షలు సమీపిస్తున్నందున చదువుపై ధ్యాస పెట్టాలని విద్యార్థులకు సూచించారు. గురుకులంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడొద్దని హెచ్చరించారు. శ్రద్ధగా చదివి తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నరసింహ, వైస్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అయితే ఎస్టీ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు, లెక్చరర్ల తీరుపై జిల్లా ఇంటలీజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. విద్యాబుద్ధులు నేర్పించాల్సిన అధ్యాపకులు విద్యార్థులను చెడు అలవాట్లకు ప్రోత్సహించడంపై విచారణ చేస్తున్నట్లు సమాచారం.

ప్రాణం తీసిన పెద్దల తీర్పు

- మనస్తాపంతో గిరిజన మహిళ ఆత్మహత్య
- పాపన్నపేట మండలం అబ్రియా తండాలో ఘటన


పోలీస్‌స్టేషన్ ఎదుట కుటుంబీకుల ఆందోళన


విజయ(ఫైల్)

పాపన్నపేట(మెదక్): పెద్ద మనుషుల తీర్పు ఓ గిరిజన మహిళ పాలిట శాపంగా మారింది. ఈ సంఘటన పాపన్నపేట మండల పరిధిలోని అబ్రియా తండాలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం .. తండాకు చెందిన లునావత్ విజయ (30), దీప్లా దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కూతురు, కొడుకు ఉన్నారు. మూడేళ్ల క్రితం దీప్లా విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందాడు. అయితే 2014లో గ్రామానికి చెందిన ఓ గిరిజన నాయకుడి వద్ద ఈ దంపతులు రూ. లక్ష అప్పు తీసుకున్నారు. ఈ విషయమై ఇటీవల తండాలో పంచాయితీ నిర్వహించారు. ఇందులో రూ.1.50 లక్షల అప్పు కట్టాలని పెద్దలు తీర్పు చెప్పారు. అయితే తాము తీసుకున్న అప్పులో రూ. 80 వేలు చెల్లించామని బాధితురాలు విజయ పంచాయితీలో వాపోయింది. తమకు అప్పు ఇచ్చిన వ్యక్తి సొసైటీ చైర్మన్ కావడంతో తన మామ ధర్మా పేరు మీద రూ. 50 వేల బైక్ లోన్ సైతం తీసుకున్నాడని తెలిపింది. కానీ ఇవేవి పంచాయితీ పెద్దలు పట్టించుకోకుండా రూ.1.50 లక్షలు చెల్లించాలని తీర్పు ఇచ్చారు. దిక్కుతోచని విజయ.. సోమవారం పురుగు మందు తాగగా.. వెంటనే ఆమెను కుటుంబీకులు మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. కాగా, తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

క్రిటికల్ కేర్‘లెస్’

ఆస్పత్రి నిర్మాణంలో కొరవడిన నాణ్యత

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికార యంత్రాంగం


ఇసుకలో మట్టి పెడ్డలు

మెదక్: జిల్లా కేంద్రంలోని పిల్లికొటాల్ శివారులో మాతా శిశుకేంద్రం (ఎంసీహెచ్) ఆస్పత్రి పక్కన 50 పడకల క్రిటికల్ కేర్ ఆస్పత్రి నిర్మిస్తున్నారు. ఇందుకు ఆయుష్మాన్ భారత్ కింద రూ.23.75 కోట్లు మంజూరైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా టెండర్ దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ పూర్తిగా నాణ్యతను విస్మరించి నిర్మాణం చేపడుతున్నారు. భవన నిర్మాణానికి ఉపయోగించే అతి ముఖ్యమైన ముడిసరుకు ఇసుకలో ఏకంగా 10శాతానికి పైగా మట్టిపెడ్డలు ఉన్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో సదరు కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని పలువురు విమర్శిస్తున్నారు. ప్రజల ప్రాణాలకు భరోసా కలిగించే ఆస్పత్రి నిర్మాణంలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు. నిర్మాణం పూర్తయ్యాక జరగరానిది జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే పిల్లర్ల నిర్మాణం పూర్తయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆ ఇసుక వాడొద్దని చెప్పాం

క్రిటికల్ కేర్ ఆస్పత్రి నిర్మాణం వద్ద నిల్వ ఉంచిన ఇసుకలో మట్టిశాతం ఎక్కువగా ఉన్న విషయం వాస్తవమే. మేము దానిని పరిశీలించి వాడొద్దని సదరు కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. నిర్మాణంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూస్తాం.

– శివగణేష్, మెడికల్ అండ్ హెల్త్ డీఈ


నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ భవనం

స్నేహితుడి నిశ్చితార్థానికి వెళ్లి..

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

- ఒకే బైక్‌పై నలుగురి ప్రయాణం..
- ఒకరికి గాయాలు
- కొంప ముంచిన నిర్లక్ష్యం
- కన్నీటి సంద్రమైన బాచారం


శ్రీకాంత్


ప్రభాకర్


భీమయ్య


ప్రమాదానికి కారణమైన కారు

అల్లాదుర్గం/పాపన్నపేట(మెదక్): స్నేహితుడి నిశ్చితార్థానికి వెళ్లిన ముగ్గురు స్నేహితులు రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడ్డారు. ఈసంఘటన అల్లాదుర్గం మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామ శివారులో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. సాయంత్రానికి తిరిగి వస్తారనుకున్న కొడుకులు శవాలుగా మారారన్న వార్త విన్న ఆ కుటుంబీకులు తల్లడిల్లిపోయారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని బాచారం గ్రామానికి చెందిన చిలుంగారి సుభాష్‌కు అందోల్ మండలం నాదులాపూర్‌కు చెందిన అమ్మాయితో పెళ్లి ఖాయమైంది. ఈక్రమంలో సోమవారం నిశ్చితార్థం నిర్ణయించారు. దీంతో అతడి స్నేహితులైన గడ్డం ప్రభాకర్ (28), గడ్డం భీమయ్య (24), శ్రీకాంత్ (24)తో పాటు తుడుం మాసయ్య నలుగురు ఒకే బైక్‌పై నాదులాపూర్ వెళ్లారు. నిశ్చితార్థం ముగించుకొని తిరిగి వస్తుండగా గడీ పెద్దాపూర్ వద్ద ఓ కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో మాసయ్య తప్ప మిగిలిన ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. కాగా గాయపడిన మాసయ్యను చికిత్స నిమిత్తం జోగిపేట ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది.

మూడు పదులకే మృత్యుఘోష..

స్నేహితుని నిశ్చితార్థానికి వెళ్లిన ముగ్గురు స్నేహితుల కుటుంబాల్లో విషాదం నెలకొంది. మూడు పదుల వయసులోనే నూరేళ్లు నిండాయని కుటుంబ సభ్యులు విలపించారు. ప్రభాకర్‌కు భార్య భాగ్య, ఒక కొడుకు, కూతురు ఉన్నారు. వృద్ధులైన తల్లిదండ్రులు కొడుకు మరణవార్త విని తల్లడిల్లిపోయారు. భీమయ్య, శ్రీకాంత్‌కు పెళ్లిళ్లు కాలేదు. కాగా శ్రీకాంత్ ఒక్కడే కొడుకు. అతడికి చెల్లెలు, తల్లిదండ్రులు ఉన్నారు. భీమయ్యకు నలుగురు అన్నదమ్ములు ఉన్నారు. గ్రామంలో అందరితో కలిసిమెలసి ఉండే స్నేహితులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో బాచారం ఘొల్లుమంది. బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు పెద్దఎత్తున సంఘటన స్థలికి తరలివెళ్లి కన్నీరుమున్నీరయ్యారు.

‘ప్రజావాణి’కి వినతుల వెల్లువ

అర్జీలు స్వీకరించిన కలెక్టర్ రాజర్షిషా


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: మెదక్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి బాధితులు తరలివచ్చారు. వివిధ సమస్యలపై మొత్తం 91 అర్జీలు రాగా వాటిని పరిశీలించిన కలెక్టర్ పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందులో అత్యధికంగా ధరణి సమస్యలపై వచ్చాయి. మిగితావి వివిధ సమస్యలపై సమర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేశ్, డీఆర్‌ఓ పద్మశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రమేశ్, ఇతర జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఏప్రిల్ 1 నాటికి జిల్లాలో అర్హులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఎంపీ ఎన్నికల దృష్ట్యా నూతన ఓటరు నమోదుపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

ఆస్తులు ఆక్రమించారు



నా భర్త చనిపోవడంతో మా మామగారి పేరున మెదక్ జిల్లాలో ఉన్న ఆస్తులను మా మరిది సారా శ్యాంసుందర్ అక్రమంగా ఆక్రమించుకున్నాడు. మెదక్‌కు చెందిన తాము ప్రస్తుతం సంగారెడ్డిలో నివాసం ఉంటున్నాం. మాకు రావాల్సిన వాటా ఇప్పించండి.

సారా లక్ష్మి, మెదక్

ఐదేళ్లుగా తిరుగుతున్నా



మా తల్లిగారు తమ్ములి గంగమ్మ 2016లో చనిపోయారు. ఆమె పేరున 1.3 ఎకరాల భూమి ఉంది. మా అమ్మ పేరున ఉన్న భూమి నా పేరున మార్చాలని గత ఐదేళ్లుగా తిరుగుతున్నా. ఇప్పటికైనా న్యాయం చేయండి.

ప్రభాకర్,
చిల్వెర, అల్లాదుర్గం

ఉపాధి కోల్పోతున్నాం

నార్సింగిలోని మల్లన్నగుట్ట వద్ద రాయి కొట్టకుండా అధికారులు అడ్డుకుంటున్నారు. మా తాతల కాలం నుంచి ఇదే జీవనాధారంగా బతుకుతున్నాం. రాళ్లు కొట్టే విధంగా అనుమతి ఇప్పించండి. లేకుంటే మా కుటుంబాలు రోడ్డున పడతాయని వడ్డెర కులస్తులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.



క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే కారు డ్రైవర్ ఆత్మహత్య

మెదక్ మున్సిపాలిటీ: ఆర్థిక ఇబ్బందులతో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి కారు డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సోమవారం మెదక్‌లో చోటు చేసుకుంది. సీఐ దిలీప్‌కుమార్ కథనం ప్రకారం.. చిన్న శంకరంపేట మండలం గవ్వలపల్లికి చెందిన శ్రీరాములు(42) మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి వద్ద కారు డ్రైవర్‌గా పనిచేశాడు. భార్యాపిల్లలతో కలిసి మెదక్ పట్టణంలోని పిల్లికోటాల్ వద్ద గల డబుల్ బెడ్‌రూం ఇళ్లలో నివాసం ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. గతంలో కూడా రెండు సార్లు ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తాళం వేసిన మూడిళ్లలో చోరీ

చిన్నశంకరంపేట (మెదక్): నార్సింగి మండల కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. మూడు ఇళ్లలో తాళం పగులకొట్టి చోరీ చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బోడ భూపాల్ ఇంటి తాళం పగులగొట్టారు. బీరువాలోని రూ.7 వేల నగదు, రెండు గ్రాముల బంగారం ఎత్తుకెళ్లారు. అలాగే గోత్రా ల శ్రీకాంత్ ఇంట్లో చొరబడిన దుండగులు రూ.20 వేల నగదు, మూడు తులాల వెండి, గ్రాము బంగారు ఉంగరం ఎత్తుకెళ్లారు. ఏటీఎం కార్డులు, ఇతర సర్టిఫికెట్లు, దుస్తులను చిందరవందర చేశారు. అద్దెకు ఉంటున్న పుట్ట సత్యం ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న రూ. 28 వేల నగదును ఎత్తుకెళ్లారు. రామాయంపేట సీఐ వెంకటేష్, ఏఎస్ఐ శంకర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం బృందం సభ్యులు ఆధారాలను సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి ఏఎస్ఐ శంకర్ తెలిపారు.

సమయస్ఫూర్తితో వ్యవహరించాలి : ఆర్డీఓ



మాట్లాడుతున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

తూప్రాన్: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సమయస్ఫూర్తితో వ్యవహరించాలని ఆర్డీఓ జయచంద్రారెడ్డి అన్నారు. సోమవారం పట్టణ సమీపంలోని బాలుర గురుకుల పాఠశాల, కళాశాల ఆవరణలో జాతీయ విపత్తు నిర్వహణ సిబ్బంది నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. భూకంపాలు, అగ్ని ప్రమాదాలు, పిడుగుపాటు, తుపాన్ తదితర అత్యవసర పరిస్థితుల్లో తొందరపాటు చర్యలు చేపట్టొదని సూచించారు. గుండెనొప్పి వచ్చిన వారికి సీపీఆర్ చేసి చివరి క్షణాల్లో ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. అనంతరం విపత్కర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలను ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ప్రదర్శన ద్వారా విద్యార్థులకు చేసి చూపారు. కార్యక్రమంలో సీఐ కృష్ణ, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎస్ఐ శివానందం, ఎన్డీఆర్ఎఫ్ బృందం ఇన్‌స్పెక్టర్ మన్మోహన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ పంటపై అడవి పందుల దాడి

ఝరాసంగం(జహీరాబాద్): సాగులో ఉన్న ఆయిల్ పామ్ పంటపై అడవి పందుల దాడి చేశారు. మండల పరిధిలోని కుప్పానగర్ గ్రామానికి చెందిన రైతు చంద్రమ్మ ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ పంటను సాగు చేస్తున్నారు. రెండు మూడు రోజుల నుంచి అడవి పందులు గుంపులుగా వచ్చి దాడులు చేశాయి. ఈ దాడుల్లో సుమారు 70 వరకు మొక్కలు నాశనం అయినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేస్తుంది. ఈ విషయాన్ని మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకువెళ్లగా.. సోమవారం పంటను పరిశీలించి వివరాలు సేకరించారు.

మినీ మేడారం.. సర్వం సిద్ధం

జాతరకు ఏర్పాట్లు పూర్తి
- సమ్మక్క, సారలమ్మ గద్దెల ముస్తాబు
- ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు

సిద్దిపేట జిల్లాలో మినీమేడారం జాతరకు సర్వం సిద్ధం చేశారు. ఈనెల 21వ తేదీ నుంచి మేడారంలో ప్రారంభమయ్యే సమ్మక్క, సారలమ్మ జాతరకు వెళ్లలేని భక్తులు ఇక్కడ దర్శించుకొని తమ మొక్కులు చెల్లించుకుంటారు. నంగునూరు, కొహెడ, బెజ్జంకి, హుస్నాబాద్, మద్దూరు, చిన్నకోడూరు, కొమురవెళ్లి తదితర ప్రాంతాల్లో అమ్మవార్ల గద్దెలను ముస్తాబు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వహణ కమిటీలు అన్ని ఏర్పాట్లు చేశాయి.



అక్కేనపల్లిలో జాతరకు ముస్తాబైన సమ్మక్క, సారలమ్మ గద్దెలు

నంగునూరు: రెండేళ్లకొకసారి వచ్చే సమ్మక్క, సారలమ్మ జాతరకు నంగునూరు మండలం అక్కేనపల్లిలోని సమ్మక్క ఆలయ ప్రాంగణం ముస్తాబైంది. గ్రామంలో మూడు దశాబ్దాలుగా జాతర నిర్వహిస్తున్నారు. మేడారం వెళ్లలేని భక్తుల కోసం సమ్మక్క, సారలమ్మలు గద్దెలను ఎక్కే ఘట్టాన్ని వీక్షించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాది తరలి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పించారు. మొక్కులు తీర్చుకునేందుకు వచ్చే భక్తులు ఉండేందుకు గుడిసెలు వేయడంతో పాటు ఉచితంగా వంట చెరుకు, నీటి వసతి, వైద్య సదుపాయం ఏర్పాటు చేశారు. బుధవారం సారలమ్మను, గురువారం సమ్మక్కను గద్దెకు తెచ్చే కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహిస్తామని ఉత్సవకమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం భక్తులు ముడుపులు చెల్లించి మొక్కులు తీర్చుకోవచ్చని పేర్కొన్నారు. గురువారం, శుక్రవారం రెండు రోజుల పాటు ఒగ్గుకథ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

జాతరకు బీజం పడింది ఇలా..

అక్కేనపల్లి గ్రామ శివారులో ఉన్న పులిగుండ్ల ప్రాంతంలో 30 సంవత్సరాల కిందట గొర్రెల కాపరి మేకలను మేపుతుండగా పెద్ద గుండు వద్ద పసుపు ముద్దలు, కుంకుమ కనిపించాయి. మేడారంలోని సమ్మక్క, సారలమ్మ జాతర జరిగే కొన్ని రోజుల ముందు ఈ సంఘటన జరగడంతో వన దేవతల మహిమగా గ్రామస్తులు భావించారు. మేడారంలో జాతర నిర్వహిస్తున్న సమయంలోనే వేడుకలు జరిపించాలని పూనకం వచ్చిన మహిళ చెప్పడంతో గ్రామంలో ఆలయ నిర్మాణం చేపట్టాలని సంకల్పించారు. చందాలు పోగు చేసి పులిగుండ్ల సమీపంలో 14 ఎకరాల స్థలాన్ని సేకరించారు. 1994లో సమ్మక్క, సారలమ్మ గద్దెలు, వారి మేనకోడలు లక్ష్మి, వడిగిద్దరాజు (నాగుపాము) ప్రతిమలను ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ప్రతి రెండేళ్లకోసారి మేడారంలో నిర్వహించే విధంగా అదే మూహుర్తాన జాతరను నిర్వహించడం ఆనవాయితీగా మారింది. మొక్కు తీర్చుకునేవారు నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించి, అమ్మవార్లకు ఒడి బియ్యం పోసి పూజలు నిర్వహిస్తారు. కోళ్లను ఎదుర్కోళ్లుగా వేసి గొర్రెలు, మేకలను బలిచ్చి మొక్కులు తీర్చుకుంటారు. అనంతరం బంధువులతో కలసి అక్కడే భోజనాలు చేసి తిరుగు ప్రయాణం చేస్తారు.

గద్దెల ముస్తాబు

హుస్నాబాద్: పట్టణంలోని ఎల్లమ్మ చెరువు సమీపంలో ప్రతి రెండేళ్లకొకసారి సమ్మక్క సారలమ్మ జాతర జరగనుంది. జాతర నిర్వహణ కోసం ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు. సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజుల గద్దెలకు రంగులు వేసి ముస్తాబు చేశారు. గద్దెల ఆవరణలో అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులకు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. జాతర జరిగే ప్రాంతాన్ని చదును చేశారు. అక్కడక్కడ చలువ పందిర్లు వేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పార్కింగ్ స్థలంతో పాటుగా కొబ్బరి కాయలు, పూజా సామానుల వివిధ దుకాణాలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటు చేశారు. తాగునీటి సౌకర్యం, లైటింగ్ సిస్టమ్ ఏర్పాట్లలో నిర్వాహకులు నిమగ్నమయ్యారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నారు.



హుస్నాబాద్‌లో సమ్మక్క సారమ్మల గద్దెలు

పరివేదలో నాలుగు రోజులు

కోహెడరూరల్ (హుస్నాబాద్): మండలంలోని పరివేద, వింజపల్లి, తంగళ్లపల్లి గ్రామాల్లో సమ్మక్క సారలమ్మ అమ్మవార్ల గద్దెలను రంగులు వేసి ముస్తాబు చేస్తున్నారు. భక్తుల కోసం క్యూలైన్లు, కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. మోయతుమ్మద వాగు సమీపంలో స్నానాలు చేసేందుకు నీటి సౌకర్యంతో పాటు స్నాపు గదులను ఏర్పాటు చేస్తున్నారు. జాతర ప్రాంగణంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా గడ్డి, పిచ్చి మొక్కలను తొలగిస్తున్నారు. ఈ జాతరకు కొహెడ, బెజ్జంకి, హుస్నాబాద్, చిగురుమామిడి మండలాలతో పాటు ఇతర ప్రాంతాలను నుంచి వచ్చి భక్తులు భారీగా తరలివస్తారు. మేడారం కోయ పూజారులచే ఈ జాతర నిర్వహిస్తారు.

ఒడిబియ్యం పోసి..



దేవక్కపల్లెలో సమ్మక్క సారలమ్మ జాతర కోసం చేసిన ఏర్పాట్లు

బెజ్జంకి (సిద్దిపేట): మండలంలోని దేవక్కపల్లెలోని మోయతుమ్మెద వాగు శివారులో ప్రశాంత వాతావరణంలో ఐదు రోజుల పాటు ప్రతి ఏటా ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. బెజ్జంకి, కోహెడ, గన్నేరువరం మండలంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి అమ్మవార్లను దర్శించుకుంటారు. ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకుంటారు. కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. భక్తుల సౌకర్యం కోసం రోడ్డు, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సంజీవరెడ్డి తెలిపారు.

భక్తుల కొంగుబంగారం



కిష్టాపూర్‌లో ముస్తాబైన గద్దెలు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని కిష్టాపూర్‌లో జరిగే సమ్మక్క- సారలమ్మ జాతర కొలిచే భక్తుల కొంగు బంగారంగా నిలుస్తోంది. 15 సంవత్సరాల నుంచి ఈ జాతర కొనసాగుతోంది. చిన్నకోడూరు, ఇల్లంతకుంట, బెజ్జంకి మండలాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

కోయవారే ప్రధాన అర్చకులు



జాతరకు సిద్ధంగా ఉన్న గద్దెలు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని కూటిగల్ గ్రామంలో సమ్మక్క సారలమ్మ జాతరను కోయవారే ప్రధాన అర్చకులుగా ముందుండి నడిపిస్తారు. మేడారం వెళ్లలేని భక్తులు తమ మొక్కులను ఇక్కడే అమ్మవార్లకు చెల్లిస్తారు. సిద్దిపేట, జనగామ, మెదక్, హన్మకొండ, కరీంనగర్ తదితర జిల్లాలకు చెందిన భక్తులు ఇక్కడికి వచ్చి అమ్మవార్ల దర్శించుకుంటారు. జాతరకు వచ్చే భక్తులకు ఇక్కడ స్నానాల కోసం నల్లా చెరువు వద్ద ఘాట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. భక్తులకు మరుగుదొడ్లు కూడా జాతర నిర్వాహకులు ఏర్పాట్లు చేయలేదు.

2002 నుంచి జాతర

4 మండలాల నుంచి భక్తుల రాక



కొమురవెళ్ల కమాన్ వద్ద గద్దెలు

కొమురవెళ్లి(సిద్దిపేట): సమ్మక్క, సారలమ్మ జాతరకు మేడారం సిద్ధమవుతుండగా మండలంలోని కొమురవెళ్లిలో ఉన్న గద్దెలు అమ్మవార్ల జాతరకు సిద్ధమవుతున్నాయి. 2002లో మండల కేంద్రానికి చెందిన చింతల రామ్మూర్తి అమ్మవార్ల జాతరకు పునాది వేశారు. కొమురవెళ్లి పాత కమాన్ సమీపంలో అమ్మవార్ల గద్దెలను స్వయంగా తానే ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు రామ్మూర్తి ఆధ్వర్యంలోనే పదిసార్లు జాతర కొసాగింది. అయితే.. కొద్దిరోజుల క్రితం ఆయన అనారోగ్యంతో మృతి చెందారు. ఈనెల 21 నుంచి జరిగే జాతర అతని కూతురు రేణుక ఆధ్వర్యంలో జరగనుంది. ఈ జాతరకు కొమురవెళ్లి, చేర్యాల, కొండపాక, కుకునూరుపల్లి గ్రామాల నుంచి భారీగా భక్తులు వచ్చి అమ్మవార్లను దర్శించుకుంటారు. అలాగే.. ఆరేళ్ల క్రితం మండలంలోని పోసానిపల్లిలో కూడా సమ్మక్క-సారలమ్మ జాతర కోసం గద్దెలను ఏర్పాటు చేసి జాతరను కొనసాగిస్తున్నారు.

కాళేశ్వరం.. తెలంగాణకు గుండెకాయ

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- బీఆర్ఎస్‌ను బద్నామ్ చేసేందుకు కుట్ర
- హామీలను పక్కదోవ పట్టించేందుకే..



దుబ్బాకలో దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: కరువు కాటకాలకు నిలయమైన తెలంగాణలో శాశ్వతంగా కరువును దూరం చేసి సస్యశ్యామలం చేసేందుకే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించినట్లు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం దుబ్బాక, అక్బర్‌పేట-భూంపల్లి, తొగుట మండలాల్లోని 154 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణకు గుండెకాయగా నిలిచిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం పనిగట్టుకొని అసత్య ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు మూలంగానే మల్లన్నసాగర్, కొండపోచమ్మ, రంగనాయక సాగర్, కూడవెల్లి, హల్దీ వాగులకు నీళ్లొచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా పక్కదారి పట్టించేందుకే బీఆర్ఎస్‌ను బద్నామ్ చేసే పని పెట్టుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దివ్యాంగులకు న్యాయం చేసింది కేసీఆరే

దివ్యాంగులకు అన్ని విధాలుగా న్యాయం చేసింది కేసీఆర్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే అన్నారు. సోమవారం దుబ్బాకలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద 20 మంది దివ్యాంగులకు బ్యాటరీతో నడిచే ట్రై సైకిల్స్‌ను పంపిణీ చేశారు. దివ్యాంగుల కష్టాలను గుర్తుపెట్టుకొని కేసీఆర్ ప్రభుత్వం రూ.4,016 ఫించన్‌ను అమలు చేసిందన్నారు. దివ్యాంగులకు ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు తాను అన్ని విధాలుగా కృషి చేస్తానన్నారు.

అంగన్‌వాడీలు అంకిత భావంతో పని చేయాలి

అంగన్‌వాడీలు అంకిత భావంతో పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు కొత్త డ్రెస్‌లను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ముందుంటానని చెప్పారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత ఎంపీపీ కొత్త పుష్పలత, ,జెడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తదితరులు ఉన్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్‌తో సైబర్ మోసం

- రూ.10 లక్షలు ఒకరు.. 8లక్షలు మరొకరు.
- పోగొట్టుకున్న బాధితులు

పటాన్‌చెరు టౌన్: ఆన్‌లైన్ ట్రేడింగ్‌తో ఓ వ్యక్తి రూ.10 లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నాగరాజు కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని కిష్టారెడ్డిపేటకు చెందిన మొబైల్ షాప్ వ్యాపారికి గతేడాది నవంబర్ 15వ తేదీన ట్రేడింగ్‌కు సంబంధించిన ఒక ఫోన్ కాల్ వచ్చింది. దీంతో అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అకౌంట్ కోసం తన వివరాలను యాప్‌లో నమోదు చేశాడు. దీంతో అపరిచిత ట్రేడింగ్ నిర్వాహకులు ఒక ఐడీని క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో సదరు వ్యాపారి నగదును ఆన్‌లైన్ ఇన్వెస్ట్ చేస్తూ వచ్చాడు. పెట్టిన నగదుతో పాటు, కమీషన్ చూపిస్తూ అపరిచిత వ్యక్తి వచ్చాడు. అయితే బాధితుడు పలు దఫాలుగా రూ.10 లక్షలు ఇన్వెస్ట్ చేసి, తాను పెట్టిన నగదుతో పాటు లాభాలు ఇవ్వాలని అడగగా వారు స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు, అనంతరం అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

పటేల్‌గూడలో మెకానికల్ ఇంజనీర్

అమీన్‌పూర్ పరిధిలోని పటేల్‌గూడకు చెందిన మెకానికల్ ఇంజనీర్‌కి గత ఏడాది అక్టోబర్ 28న ట్రేడింగ్‌కు సంబంధించిన మెసేజ్ టెలిగ్రామ్ ద్వారా వచ్చింది. దీంతో అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అకౌంట్ కోసం తన వివరాలను యాప్‌లో నమోదు చేశాడు. దీంతో అపరిచిత ట్రేడింగ్ నిర్వాహకులు ఒక ఐడీని క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఆ మెకానికల్ ఇంజనీర్ నగదును ఆన్‌లైన్ ఇన్వెస్ట్ చేస్తూ వచ్చాడు. అయితే బాధితుడు పలు దఫాలుగా రూ.8 లక్షల 29 వేలు ఇన్వెస్ట్ చేసి, తాను పెట్టిన నగదుతో పాటు లాభాలు ఇవ్వాలని అడగగా.. అపరిచిత వ్యక్తులు స్పందించలేదు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు, తర్వాత అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

హామీలు అమలు చేస్తాం

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు



శివాజీ విగ్రహం వద్ద మైనంపల్లి రోహిత్‌రావు

మెదక్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహ మొదటి వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బతికి ఉన్నంతకాలం ప్రజా సేవ చేసుకుంటానని చెప్పారు. పట్టణంలోని రాందాస్ చౌరస్తాతో పాటు మరో రెండు చౌరస్తాలను సుందరీకరిస్తామని పేర్కొన్నారు. అభివృద్ధి అంటే ఏమిటో చేతల్లో చూపిస్తామన్నారు. అంతకు ముందు పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ చంద్రపాల్, మల్లికార్జున్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు అనిల్, ప్రశాంత్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు ప్రసాద్, రాష్ట్ర నాయకులు పంజా విజయ్‌కుమార్, నాయకులు మేడి గణేష్, బోస్, శివ తదితరులు పాల్గొన్నారు.

స్కూటీని ఆపి.. ఉంగరాలు చోరీ



విచారణ చేస్తున్న పోలీసులు

చేగుంట(తూప్రాన్): స్కూటీపై వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు ఆపి ఉంగరాలు దొంగిలించిన సంఘటన చేగుంట శివారులోని రెడ్డిపల్లి బైపాస్ బ్రిడ్జి వద్ద సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంటకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు రామచంద్రం స్కూటీపై చేగుంటకు వస్తున్నాడు. ఈ క్రమంలో రెడ్డిపల్లి బ్రిడ్జివద్ద రెండు బైకులపై వచ్చిన వ్యక్తులు పోలీసుల పేరుతో అతన్ని ఆపి, మాటల్లో దింపి చేతి వేళ్లకు ఉన్న రెండు బంగారు ఉంగరాలు బలవంతంగా లాక్కొని పారిపోయారు. బాధితుడు వెంటనే చేగుంట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, రామాయంపేట సీఐ వెంకటేశ్, చేగుంట ఎస్ఐ బాలరాజు సంఘటన స్థలాన్ని చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దొంగల వేటలో పోలీసులు

- ముగ్గురు సభ్యుల ముఠా పనే..
- కర్ణాటక వాసులుగా నిర్ధారణ



సీసీ పుటేజీలో నమోదైన దొంగలు

జహీరాబాద్: జహీరాబాద్ ప్రాంతంలో కలకలం రేపిన దొంగతనాల కేసును ఛేదించేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. కర్ణాటక పోలీసులతో కలిసి దొంగలను పట్టుకునేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఆదివారం తెల్లవారుజామున జహీరాబాద్ పట్టణంలో ముగ్గురు సభ్యుల దొంగల ముఠా గంట వ్యవధిలోనే ఏకంగా 11 ప్రాంతాల్లో చోరీకి పాల్పడిన విషయం తెలిసిందే. రెండు మద్యం దుకాణాలు, రెండు కిరాణ షాపులు, మూడు బట్టల దుకాణాలు, ఒక బ్యాంగిల్ స్టోర్, మూడు ఇళ్లలో ఈ ముఠా దొంగతనాలకు పాల్పడింది. మోటారు సైకిల్‌పై వచ్చి దొంగతనాలు పాల్పడి పరారైంది. వీరిని కర్ణాటక ప్రాంతానికి చెందిన వారిగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. దొంగలను పట్టుకునేందుకు కర్ణాటక పోలీసుల సహకారం తీసుకుంటున్నారు. ఇప్పటికే వారిని ఆశ్రయించి సమాచారం సేకరించారు. దొంగతనాలకు పాల్పడిన ముఠా కర్ణాటకలోని చించోళి, బీదర్, గుల్బర్గా, బస్వకళ్యాణ్ ప్రాంతాల్లో 9 దొంగతనాలకు పాల్పడినట్లు, జహీరాబాద్‌లో పాల్పడిన దొంగతనం పదోకేసుగా పోలీసులు పేర్కొంటున్నారు. వీరు చేసిన దొంగతనాలు ఒకే తరహాలో ఉన్నట్లు గుర్తించారు. కర్ణాటకలో జరిగిన దొంగతనం తీరులోనే జహీరాబాద్‌లో జరిగిన దొంగతనాల తీరు ఉందని వారంటున్నారు. కేవలం క్యాష్ కౌంటర్‌లనే లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారు. జహీరాబాద్‌లో రెండు మద్యం దుకాణాల్లో జరిగిన దొంగతనాల్లో వారు ఒక్క మద్యం బాటిల్ కూడా ముట్టుకోకుండా క్యాష్ కౌంటర్ వద్దకే వెళ్లి డబ్బు తీసుకొని ఉడాయించిన తీరు సీసీ పుటేజీలను బట్టి తెలుస్తోంది. లక్షలాది రూపాయల విలువ గల మద్యంతో పాటు ఆయా దుకాణాల్లో ఖరీదైన బట్టలు, కిరాణా సామగ్రి ఉన్నా వాటిని ముట్టుకోలేదు. సుదీర్ఘ కాలం తర్వాత జహీరాబాద్ ప్రాంతంలో దొంగతనాలు జరగడం కలకలం రేపింది. జర్నలిస్టు కాలనీలో మూడు తాళం వేసిన వాటిని తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడ్డారు. చోరీకి గురైన వ్యాపార సంస్థల్లో వ్యాపారులు నగదును ఉంచకపోవడంతో పెద్దగా డబ్బు దొంగతనం జరగలేదు.

ప్రాంతాలను మార్చుతూ..

దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా ప్రాంతాలను మార్చుతూ దొంగతనాలు చేస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఎలాంటి రెక్కీ నిర్వహించకుండానే దొంగతనాలు చేస్తున్నట్లు ఆయా ప్రాంతాల్లో జరిగిన దొంగతనాల తీరును బట్టి తెలుస్తోంది. ముఠా సభ్యులు దొంగతనాలు చేయడంలో ప్రావిణ్యులుగా ఆరితేరినట్లు భావిస్తున్నారు.

త్వరలో పట్టుకుంటాం

జహీరాబాద్‌లో దొంగతనాలకు పాల్పడిన ముఠాను త్వరలోనే పట్టుకుంటాం. ముఠా సభ్యులు కర్ణాటక ప్రాంత వాసులుగా నిర్ధారణకు వచ్చాం. అక్కడ ఇప్పటి వరకు తొమ్మిది చోట్ల ఇదే తరహాలో దొంగతనాలకు పాల్పడ్డారు. అక్కడి పోలీసుల సహకారంతో కేసును ఛేదిస్తాం. ఇప్పటికే వారి సహకారంతో దొంగతనాల తీరును గుర్తించాం. ముగ్గురు సభ్యుల ముఠానే దొంగతనాలకు పాల్పడింది.

–రవి, సీఐ–జహీరాబాద్